



# ముగ్గులతో స్వాగతం



**ము**గ్గులతో ప్రతి పల్లె
ఆహ్వానం పలుకుతోంది
రంగులద్ది.... గొబ్బెమ్మలు పేర్చి
మరీ మరీ రమ్మంటోంది !
చుట్టం వస్తే ఒక్క పూటకే
ముఖం చూసుకునే సంస్కృతి
పల్లెకి లేదండోయ్ !
గడ్డ కట్టించే చలిని
భోగిమంటతో తరిమెయ్యడం
తెలుసుకోండోయ్ !
పసి తనానికి
ఆశీర్వచనాలతో
భోగిపళ్ళ సరదా తీర్చండి !
తలంటోసుకుని... కొత్త బట్టలేసుకుని
టైములేదనే మాటలేకుండా
కలసి కమ్మని అనుభూతుల్ని
కలబోసుకోండి !
డైటింగులని పక్కకి పెట్టి
రోగాలకి చెక్ చెప్పి
రక రకాల పిండి వంటలు
ఆరారగా తినండి !
గాలిపటాలతో
మీ మనసుని కాసేపు పక్షిని చేసి
ఆకాశంతో మంతనాలాడండి !
కమ్మని దృశ్యాల్ని
కంటితో క్లిక్ చేసి
హృదయపు ఆల్బంలో భద్రపరచుకుని
జీవితకాల మధురోహల్ని
మననం చేసుకుంటూ
మళ్ళీ మరమనిషిలా
మనీ మనిషిలా బ్రతకడానికి
పట్నానికి రండి !
వదల్లేక వదల్లేక వస్తున్నారని
మాకూ తెలుసండి
కానీ తప్పదు కదండి !

—ప్రతాప వెంకట సుబ్బారాయుడు